

# దేశ భాషలందు తెలుగు లెస్స

అది నేషనల్ కాడెట్ కోర్ క్యాంప్ ఇస్తున్న పార్టీ. కోర్సు ముగిసి కొంతమంది యిళ్లకు వెళ్లి పోతున్నారు. యన్సీసీ డే అని కూడా యిస్తున్నాడు పార్టీ. చాలామందికి ఆహ్వానాలు వెళ్లాయి. తల్లిదండ్రులకీ, ఆఫీసర్లకీ, పురప్రముఖులకీ, కార్పోరేటర్స్‌కీ వెళ్లాయి ఆహ్వానాలు. పట్నానికి దగ్గరే నందికొట్కూరు. వినోదకార్యక్రమంతో పార్టీ మొదలౌతుంది.

ఆహూతులు చాలా మంది తమ తమ వాహనాల్లో వచ్చారు. కొంతమంది బస్సుయెక్కి వచ్చారు. కొంత మంది ఆఫీసర్లు ప్రభుత్వ వాహనాల్లో వచ్చారు.

కార్యక్రమం అయిదున్నరకే మొదలు. విందు యెనిమిదిన్నరకి మొదలౌతుంది. వినోదం మొదలైంది. ఫాన్సీ డ్రెస్.

విద్యార్థులు పాటపాడుతూ తట్టు నాట్యం ఆడుతున్నారు. ''యన్సీసీగామా! సంగమేశమామా!'' అని బృందగానం చేస్తున్నారు.

అరేంజ్‌మెంట్స్ బావున్నాయి. వచ్చిన వారందరికీ సాఫ్ట్ డ్రింక్స్ అందిస్తున్నారు కేడెట్సు. మంచి వంట మసాలా ఘుమఘుమలు వస్తున్నాయి. వేయించిన జీడిపప్పులు ప్లాస్టిక్ గిన్నెలో వుంచి యిస్తున్నారు. మెత్తలున్న కుర్చీలూ, వాతావరణం బావున్నది.

ప్రిన్స్‌పాల్ భార్య అడిగింది. ''డబ్బా అందిందా మిసెస్ శామ్యూల్? దాన్ని కలెక్ట్ చేసి పంపేప్పటికి నా తాతను చూశాను.''

'' ఆ. ఆ. అందింది. మీ భంట్రోతు కారులో తెచ్చిచ్చాడు. చాలా థాంక్స్ ప్రేమా ! కాని డబ్బీలోంచి నూని యెలా బైటికి లాగాలో తెలియలేదు. ముంబాయి వాడాలా?'' అన్నది లలితమ్మశామ్యూల్.

''టొక్క వేయాలి. టొక్క.'' అభినయించింది ప్రేమ.

''యెక్కడేయాలీ, యెలా యేయాలీ ? యెంత టొక్కేయాలీ?'' చేయి ఆడిస్తూ అడిగింది మిసెస్ శామ్యూల్.

వారిద్దరినీ చూసి సబ్ జడ్జీ భార్య కమలం నవ్వింది.

''దాన్ని మరీ యేడిపించకు. డబ్బీకి గుండ్రని మూతమీద నిప్పు ముక్కలుంచితే తగరం కరిగి బిళ్ళ వూడొస్తుంది. దోసె కాడున్నదా?'' అని మెల్లిగా అడిగింది.

''దేనికీ?''

''పీకేకి. అదిగూడా తెల్దా?''

యస్పై భార్య సౌదామిని భుజం తట్టుతూ చెప్పింది.

''అంత బాధ లేదు. చపాతీ కట్టెవాడినా పీకేయవచ్చు.''

అటుగా వెళ్తూ చేతులో కోలాసీసా దానిలో స్ట్రా వున్న డైరెక్టరు వీరిని పలకరించి నవ్వాడు.

''అప్పన్నగారూ బాగున్నారా? పెళ్లాడారా?'' కుసుమ అడిగింది. ఆమె గైనకాలజిస్టు.

'' ఆ. ఆ. ఆడినాను. థాంక్సు. నాయిసయం నన్నూ మరువరు మీరు. కానీ మీరు సూపిన వారిజ'' అని నవ్వి నోటిమీద చెయ్యివేసుకుని తీసేసి, ''యీనాడట్లనరాదు యెణుకబడినవోండ్ల బిడ్డేనీ గాదు! అల్లు మా బిడ్డెని సూడ రావద్దన్నారు. నేను తాళికట్టినామె అస్సామీస్. జామిపండులాగా వుంటుంది. మా గృహానికి మీరు రావాలని మా భార్యలలామను సూడరమ్మనీ వేడుకుంటున్నాను.''

''తప్పకుండా మీ భార్యలలామని సూడవస్తాం'' అన్నారు ముక్త కంఠంతో. ఆయన వెళ్లి పోయాడు.

''అన్నమ్మగారూ మీపన్మన్ని కొండమ్మ రావటం లేదూ? దాని ఘోషవినని దినాన నాకు తలదిమ్ము వస్తాది. నా బొచ్చెలూ లోటాలూ కుండలూ మా నౌకర్ సన్యాసి తోమెననుకోండి. కాని కొండమ్మే తెల్లగా బమిడి వెసల్స్ లాగా తోమి లోనకి పూడ్సి అటకమీద అప్సైడ్ డౌన్‌గా బోర్లిస్తది. మర్లా షుభ్రపరిచే అవసరమే పడదు. నౌకర్ తోమినాడంటే, పార్టికిల్స్, బేడలు గిన్నెలంటి వుండేది కనబడ్తాది. ఆ ముండే మల్లా రాంగనే డైనింగ్ బల్లా షెల్ఫూ తుడిచేస్తది.''

పక్కనున్న రత్నం శ్రేష్ఠి భార్య నవ్వింది. ఆవిడ పేరు ధనలక్ష్మి.

''యెందుకు లాఫ్ చేస్తవు మనీ?''

ధనలక్ష్మి యింకా నవ్వింది. ''కొండమ్మ ముండగాదు. దానికి కట్టుకున్నవాడు గాక ఎగ్స్ట్రా మొగుడూ, యిద్దరు లవర్సూ వుండిరి. మీరలా అంటే నవ్వురాదు?''

''మీ కిచెన్ తోటలో వెజిటెబుల్స్ కల కలలాడుతూ అట్రాక్టివ్‌గా వుంటాయి. ప్లాంట్స్‌కి ఆయుర్వేదిక్ మెడిసిన్స్ వాడుతారా?'' పూనమ్ మిత్రాణీ భార్యా డిపార్ట్‌మెంటల్ స్టోరున్నామె అడిగింది ధనలక్ష్మిని.

''మందులూ వాడను. మాకులు వాడం. మా నౌకర్ పెంట పోగుచేసి మొక్కల్లో వేస్తాడు. లేదా తానే వెళ్లి మేకలూ ఆవులూ కాసేవాళ్లనడిగి బండిలో తెస్తాడు.'' పక్కనున్న ధుర్రేశ్వర్, రోజ్ నవ్వారు.

''యేమిటికే నవ్వుతారు. యేమి తప్పు? పోనీ నీదా సొల్లు'' అన్నది పోస్ట్ మాస్టర్ భార్య వెంకట్ రమణి.

''యెరువు వాడాము అనచ్చుగా. కసువు పోశాము అన్నా అదే అర్థం. ఆ పదం యెవరు వాడుతుంటే పట్టుబడిందోనని నవ్వుతున్నాం. మీకు పొడుచు కొచ్చిందేల?''

''మిసెస్ సుభా! మీ పన్‌మడిసి మొత్తుకోళ్లు వినలేక చచ్చినాను. దాని పే దాని చేతులో పెట్టేయరాదూ? అదెలా యూస్ చేస్తే నీ కెందుకు! దాని డబ్బది కర్చు చేసుకుంటాది. అది నీ పనికాదు'' అన్నది షీలా రమణి.

''యేమి పితూరీ లేవదీసిందది నామీనా? నేను దానికి బంగారు బాట వేస్తున్నాను. అది ఆల్కహాలిక్కు. నీకేల బెడద?'' సుభాజేమ్స్ సి. ఐ. భార్య నవ్వింది.

''యెండి ముర్గుల్ సేయించి సేతులకెక్కించి నావనీ, బీడీ ముక్కకీ, సుట్టపీకకీ గూడా సేతిలో యెర్రని యేగానీ లేదనీ, దుగ్గానీ గానీ, ఒన్ రూపీగానీ దాని చేతిలో పడేయమనీ, దాని జీతంనుండి నీ నుండి లాక్కోమనీ ఘోషించింది జాకాల్లాగా. నేనెందుకు కక్కాలీ వన్ రూపీ?'' అన్నది షీలా.

'' అహా! ఐసీ. కాస్ట్లీ సారీస్ కొనిచ్చాను. ఒక్క సంవత్సరము వర్కూ యింక గుడ్డా గోచీ కొనుక్కోక్కర్లేదా అసత్యాలకోరు. మీ పని ఆమె నాగా పెట్టిందనీ, దాని కాండ్లకు మొక్కి రమ్మంటే మీ వీడుకి వచ్చిందట. అప్పుడప్పుడు చేయూతగా యెల్తున్నానన్నది నాతో. వాటె బుద్ధి లేని మడిసి వన్ మస్టబి దాన్ని యాచించటానికీ కాళ్లకు మొక్కటానికీ అనుకున్నాను'' అని విరగబడినవ్వింది.

సౌందర్యవల్లి జిల్లా జడ్జీగారి భార్య, జాయింట్ కలెక్టర్ భార్య నడిగింది.

''వంటోడొస్తున్నాడా శాంతమ్మ గారూ? నాకు చాలా యిరుకుగా వున్నది. నేనే వంటమనిషిలాగా అవతరించాల్సి వస్తున్నది. వడ్డనా వార్చటంగాక కూరా నారా కొయ్యటం తుంచటం పీకటం, యిస్తరాకులు పీకటం గూడా

చేయాల్సి వస్తున్నది ఖర్మ'' అని చేతితో నుదురు కొట్టుక్కుంది.

''నీవే యెందుకు సేస్తావు?''

''అత్తగారు నా యింటికి తగలబడ్డారు.''

''నా కా కర్మ లేదు. బాపనోడు వంటోడుగా కుదిరినాడు. నా యజమాని వాని బిడ్డెకి వుద్దేగం వేయించె. దానిమీద జీతం నాతం ముట్టనని వంటసేస్తుండడు'' అన్నది గర్వంగా.

''కులం పోదటనా?''

శాంతమ్మ నవ్వి తల అడ్డంగా ఆడించింది.

''అహో. పోదట. ప్రొద్దుట తలకు స్నానం చేస్తడు. తలుపు వేసుకుని వంట కానిచ్చును. తనకని యేరే బొచ్చెల్లో అకుల్లో యెట్టేసుకుంటాడు. అన్ని వంటకాలు తెచ్చి సక్కంగా బల్ల మీదుంచి, పల్లేలు లోటాలు సర్ది మంచినీలు తానే పోస్తడు. నా అయిదుగురు బిడ్డలచేత తినిపించి సేయీ మూతి కడిగి బడికి తోల్తడు. నా బిడ్డల్ని ''మీరు'' అని సంబోదిస్తడు. కూడు దిన్న బల్ల షుభ్రం చేసి గిన్నెలు బొచ్చెలు పని ఆమెకేసి పోయి, మరో తూరి తలమీన నీళ్లోసుకుని వంటిట్లో దూరి గెడెట్టుకుని అన్నీ అరగించును. కులమేడకి పోద్ది?'' అని నవ్వింది.

సౌందర్యవల్లికదంతా వెక్కిరింతగా తోచి కోపమొచ్చింది. అగ్రకులంవాడు తనింట్లో వంటోడంటున్నదని నొచ్చుకుని మరి పల్కరించలేదు.

భానుమతి మేజస్ట్రేట్ గారి భార్య. డ్రింక్ తాగుతున్నది. పక్కింటామె ఛీఫ్ యెకౌంటెంట్‌గారి భార్య సర్వలత.

''మహానంది వెళ్లొచ్చారా? స్నానం చేశారా? డి.యమ్.వొ. భార్యా రాజామణిని దోవ అడిగితే, తన స్వంత కారులో తానే తోలుతూ తీసికెళ్తానన్నది ఆ నాడు. మీరలా కూడు-గుడ్డా తెచ్చుకోటమే ఆడ వోటేలుగానీ, పూటకూల్లమ్మ గుడిసెగానీ లేదన్నది.''

'' ఆ. ఆ. యెల్లివచ్చేస్తిమి. యెన్ని యిగాతాలనీ! సమయానికి మా నాయనమ్మ సచ్చిందని కబురందె. ఆగినాము. అదయాక బేల్దేరితే యెదురింటి బామ్మగారు, 'ఆ. ఆ. యెల్లకండెల్లకండి. ఆడీ మద్దినే అలగాజాతి యాత్ర చేసి వచ్చింది. స్నానాల కాడ నీటి నిండుకూ గిన్నెలు కుండలు కడిగితే అన్నం మెతుకులూ, సేపసెత్తా, కోడి తలకాయలున్నాయి. శుభ్రంగా లేదు నీరు.' అన్నది. మల్లా ఆగినాము. మల్లా కారు యెక్కినాము. ఈ తూరి సర్పమే డ్రైవరు. దాని నౌకరొచ్చి మొత్తుకోళ్లు చేసినాడు.''

''జీతమిప్పించు మేడమ్! తిండీ తీర్థం లేదు'' అని మొక్కితే జాతిగుండె సర్పలత పడగ ఆడిస్తూన్నట్టు తల ఆడిస్తూ, ''ముందు గుడిసె వేయరా! ఆలిని తెద్దువుగానీ. జీతమంతా తాగేస్తావు యివ్వను'' అంటూనే కారు స్టార్టు చేసి విమానంలాగా తోలింది. నాకు కళ్లెంబడి నీరు కారినై. తొంగి చూస్తే లగెత్తి కారు వెంట వస్తున్న బుడ్డోడు కంట బడె. నా చేతిసంచీ నుండి యాభై నోటు తీసి ఆడిమీదికి యిసిరేసి, గుట్టుసక్కంగా యెనక సీట్లో యెనక్కానుకుని కూచుంటి. మహానంది చేరి తానాలాడి రేత్రికి కొంప జేరినాము'' అని నవ్వింది.

''భోజనం వేళైంది రమ్మంటున్నారు'' అని ఒక విద్యార్థిని వచ్చి అందర్నీ లేవగొట్టి తోలుకెళ్లింది.

''మనం చూసుకోలేదు. కాలం సమీపించింది'' అని మేరీ జాన్సన్ హెడ్ మిస్ట్రెస్ నవ్వింది.

''బాగా తెలుగు వచ్చు. మేష్టర్ని యెంగేజ్ చేసి మంచి తెలుగు అలవరచుకున్నా. సన్‌సెట్ అంటే సూర్యోదయం. సన్‌రైజ్ అంటే సూర్యాస్తమయం. కరెక్టేనా?'' నడుస్తూ అడుగుతున్నది.

స్పూన్, ఫోర్క్, డిన్నర్ ప్లేట్ కాగితం రుమాలు అందుకుని సొగసుగా వడ్డించుకోసాగింది.

''కరకట్టుగా చెప్పారు సుమండీ. నేనూ తెలుగుదేశం పుడ్చినాను. మాది చిత్తూరు వద్ద తిరుత్తని. ఆడ మురుగన్ని సామి అంటే నవ్వాను.''

హుస్సేన్ సాహిబ్ అన్నీ వడ్డించుకు వచ్చి నవ్వుతూ పలకరించాడు. ''సేమమా?'' అని అడిగాడు.

''పిల్లలెంతమంది సాహిబ్ ?''

''మనకా?'' అని పైకి చూసి గుర్తు చేసుకోసాగాడు. గడ్డంలో వేలు దూర్చి గోక్కున్నాడు.

''మనకేమిటీ? అదేం తెల్గూ. తెలంగాణా వారా? నీకూ నాకూ పుట్టారా? కన్నబిడ్డలెంతమందో గుర్తులేదూ? విచిత్రమైన సాహిబ్!'' అని నవ్వింది.

''షుక్రియా! మనకెవరు నవ్వినా దర్ద్ కలగదు. నేను తెలుగుబిడ్డను. తెలంగ్ బచ్చా. మనకిప్పటికి ఛే లడకా లడ్కియా'' అని అందంగా నవ్వాడు. అడిగినామె పళ్లెంలో మరో స్వీట్ వడ్డించాడు.

''పదండి. వారు సర్వ్‌చేసుకోవాలి.'' అన్నాడు.

''నీ పర్సనాలిటీ చూసి నీ తెలుగు క్షమిస్తాను''అని సరసమాడిందామె.

''బహుత్ ధన్య హూ. మీరు మా ఘర్‌కి రండి'' అన్నాడు. స్పూన్‌తో తింటున్నాడు.

''యెన్నింటికీ?'' అని తానూ తింటున్నది.

''దస్ బజె'' అని కన్నుగీటి, ''జారత్ గృహంలో నహీ హై.'' అని నవ్వాడు.

''యేమిటి నీ ఐడియా సాహిబ్!'' అని కొట్టబోయింది.

''గుస్సా యేల మేడమ్?'' అని వెళ్లిపోయాడు.

ఒక విద్యార్థి ఫాన్సీ డ్రెస్ వేసి పాముబుట్ట మూత తీసి పామునాడిస్తూ నాగస్వరం వూదుతూ చేతితో దాన్ని పొడుస్తుండగా పాము కాటువేసింది. విద్యార్థి పడిపోయి, గిలాగిలా తన్నుకుంటూ, 'పైసలు రాల్చండి యిసానికి యిరుగుడు కొనాల'' అంటున్నాడు. కొంతమంది జోబీలనుండి రూపాయబిళ్లలు తీసి పడేశారు. మరికొందరు నోట్లు మీద పడేస్తున్నారు. పాము జరజరాపాకుతూ అందరి మధ్యనించీ పారిపోయింది.

''ఆడు దొంగెత్తేస్తున్నాడు. నిజంగా సావటం లేదు. డబ్బేయకండి.'' నోటినిండా పెరుగన్నం కూరుకుంటూ అంటున్న దొకామె.

మరోవిద్యార్థిని నవ్వుతూ అన్నది. ''అది ఫాన్సీ డ్రెస్. అది వినోదం. వినోదం వినోదిస్తూ డబ్బు రాల్చద్దా?'' అలా అంటూ తన పూసల సంచీ విప్పి అయిదు రూపాయల నాణెం పాముల వాడి ముందు పడేసింది.

''యేటే! నీ దర్పం! మా యింటి పక్కన చేరావు. యెంతిస్తున్నావేటి అద్దె? మేము రెండు వేలు చెల్లిస్తావుండాము'' అన్నది మరొకామె.

''మా సాజన్నే అడగండి. ముఖాముఖం అడగటానికి మీకు గుండెలు లేవా? నేను కిరాయి చెల్లించటం లేదు'' అన్నది పంజాబీ డ్రెస్ అమ్మాయి.

'పనిమనిషి కెంతిస్తుండావే? అది నీ యిల్లు వదిలిరాదు. మాకు లేటౌతుండాది''

''అదీ సాజన్నే అడగాలి. నేను దాన్ని ఎంగేజ్ చేయలేదు. అది నాకు వెరవదు.''

''యెంత పొగరు? నీకేం అధికారం లేదంటావా? యెవురు నమ్ముతారంటావు? లేచొచ్చిన బాపతా?''.

''పోనీ అలాగే అనుకోండి. నేనా పనిచేయలేదు గదా.''

''యెందుకెల్లిపోవే, అధికారమివ్వకపోతే. టి.వి.మీద తెయితక్క లాడుతూ అగుపిస్తావు. యెంత ముట్టుతుందీ?'' అని దీర్ఘం తీసింది.

''మరోడు దొరక్క వెళ్లిపోను. మిమ్మల్నీ టి.వి. మీద అగుపించేట్టు చేస్తారండి. యెంత ముట్టేదీ తెలుస్తుంది'' అని కవ్వించి వెళ్లిపోయిందా అమ్మాయి.

ఒక తల్లి కొంగుపట్టుకు నడుస్తూ ఐస్ క్రీమ్ తింటున్నాడో ఆరేళ్లబ్బాయి. తండ్రి వెనక నడచి వస్తున్నాడు.

''యేరోయ్! బడుద్దాయి! బడీ గిడీ లేదా! తల్లి కొంగుబట్టుకు తిరుగుతున్నావు ?'' అని పలకరించాడో యన్‌జివో.

తల్లి వెనక్కు తిరిగి తండ్రి వంక చూసింది.

''వాడీ మధ్య డెప్యూటీ అయినాడులే. అందుకనలా మర్యాదగా మాట్లాడుతున్నాడు'' అన్నాడు తండ్రి.

విందు ముగియ వచ్చింది.

సంగమేశ్వర శాస్త్రి కప్తాను. ఆ యూనిఫామ్ ఆయనా. నిండా ఆరడుగుల మనిషి. తల నెరవలేదు. ఉక్కు కడ్డీలాగా వుంటాడు. ఈ తెలుగూ, యీ

కల్బురూ వినోదిస్తూ అందరి మధ్యా తిరుగుతూ పలకరిస్తూ వెళ్తున్నాడు.

మరోవేపు వెళ్లి తంబోలా అనే కార్యక్రం మొదలు పెట్టించాడు.

ఇంకోవేపు యెత్తుగా నల్లబల్ల. దాని మీద శివుని చిత్రం చాక్‌పీస్‌తో గీయబడి వున్నది. ఆయన పద్మాసనం వేసి ధ్యానముద్ర పట్టాడు. ఆయన సిగలో పక్కగా చంద్రవంక గీసినవారికి బహుమానం యిస్తారు. కళ్లకు గంతలు కట్టించుకుని వెళ్లి గీయాలి. అయిదడుగుల యెత్తునే వున్నది చిత్రం.

సంగమేశ్వర శాస్త్రి నల్లని సిల్క్ కర్చీఫ్ అందిస్తున్నాడు. అతిథులు వుత్సాహంతో గుమిగూడుతున్నారు. దీపాలు బాగా వెలుగుతున్నాయి.

ఈ మాటు రహస్యంగా మాట్లాడుకుంటున్నారు స్త్రీలు. ''దినామూ యాడికి పోతుండావు?''

''హాస్పటల్‌కి''

''యేమిటి రోగం?''

''కాలునెప్పి.''

''యేమిసేస్తురు?''

''కరెంట్ పెడతారు''

''నేను హోమియో వైద్యం చేస్తును రా. మూడ్రోజుల్లో తగ్గిపోద్ది. శాన్నాళ్లనించీ యెల్లుంటివి?''

''మీరే వేసుకోండి.''

''మీ అయనకేం పనీ?''

5246



''ఫిక్సర్''

''అంటే యేమి చేస్తడూ?''

''అన్నీ బాగు చేస్తాడు'' అని కళ్లకు గుడ్డ కట్టించుకోటానికి వెళ్లిందా అమ్మాయి.

''పోతానమాత్యా వివాహంబాడితివా?'' అనడిగిందో జవ్వని. పోతనామాత్యుడు యన్జీవొ.

''నేదు. ఇంకా ఆడనేదు డియర్. అరిపిల్లను చూడ వెళ్తే రాబాక అనిరి'' అనగానే నవ్విందా అమ్మాయి.

కప్తాను వచ్చి ''రండి రండి చంద్రవంక గీయాలి'' అన్నాడు.